క్లుప్తంగా

బైపాస్‌రోడ్డు ప్రణాళికలో మార్పులు



భూములను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

మంత్రాలయం: మంత్రాలయం గ్రామ శివారులోని జాతీయ రహదారికి అనుసంధానంగా కల్లుదేవకుంట వరకు నూతనంగా నిర్మించబోయే బైపాస్‌రోడ్డు ప్రణాళికల్లో మార్పులు చేర్పులు ఉంటాయని శ్రీమఠం ఎస్టేట్ ఆఫీసర్(రిటైర్డ్ తహసీల్దార్) శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం బైపాస్ రోడ్డు వెళ్లే పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులకు, శ్రీమఠానికి నష్టం వాటిల్లకుండా ప్రణాళికలను సిద్ధం చేసి శ్రీమఠం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థుల ఆదేశాల మేరకు నడుచుకుంటామన్నారు.

బాపురంలో రోడ్లకు గ్రావెల్



కాలనీల్లోని రోడ్లకు గ్రావెల్ వేస్తున్న దృశ్యం

కౌతాళం: బాపురం గ్రామంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో అభివృద్ధి చేస్తామని సర్పంచ్ శిల్పారెడ్డి, గ్రామ నాయకుడు గురునాథ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రావెల్ రోడ్డును వేశారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో గ్రామంలో మరింత అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. ఇప్పటికే గ్రామంలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడం, వంకకు బ్రిడ్జి నిర్మాణం లాంటి ఎన్నో అభివృద్ధి పనుల్ని చేపట్టామని తెలిపారు.

ఏఈగా ప్రసన్న ఆంజనేయులు



ఎమ్మిగనూరురూరల్: విద్యుత్‌శాఖ ఏఈగా పి. ప్రసన్న ఆంజనేయులు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండల ఏఈగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో ఎమ్మిగనూరుకు వచ్చారు. ఆయన మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, పట్టణ ప్రజల సహకారంతో సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

మంత్రాలయంలో మద్యం విక్రయిస్తే చర్యలు



పట్టుబడిన మద్యంతో ఎస్‌ఐ పరమేష్‌నాయక్, సిబ్బంది

మంత్రాలయం: మంత్రాలయంలో బెల్ట్‌షాపులు నిర్వహించి మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రాలయం ఎస్‌ఐ పరమేష్‌నాయక్ హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని పాతవూరుకు చెందిన మల్లికార్జున వద్ద 41 క్వాటర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. రామచంద్రనగర్, రాఘవేంద్రనగర్‌లో పలు చోట్ల తనిఖీలు చేపట్టారు. ఎవరైనా మద్యం విక్రయిస్తే తమకు సమాచారం ఇవ్వాలని వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థులకు చెస్ పోటీలు



మాట్లాడుతున్న స్పార్క్ చెస్ అకాడమీ సభ్యులు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని నేషనల్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో స్పార్క్ చెస్ అకాడమీ, సాయిజ్యోతి నేత్రదానం ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సభ్యులు గోపాల్‌రెడ్డి, కొల్లి శ్రీధర్, జంబులయ్య సహకారంతో ఆదివారం చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. పోటీల్లో 115 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలకు రూ.10 వేలు నగదు, మెమోంటోస్, మెడల్స్ అందజేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో చెస్ అకాడమీ సభ్యులు నందకిశోర్, స్వాతి, ఎస్టీయూ యూనియన్ రాష్ట్ర నాయకులు నాగరాజు, మహాదేవప్ప, ఐ ఫౌండేషన్ సభ్యులు విశ్వనాథ్, శివ, పీఈటీ పాల్గొన్నారు.

24న కనక దాసు జయంతి

ఎమ్మిగనూరుటౌన్: ఈనెల 24న భక్త కనకదాసు జయంతితో పాటు కార్తీకవన భోజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కురువ సంఘ నాయకులు మద్దిలేటి, మల్లయ్య, యాపిల్ ల్యాబ్ బీరప్ప, ప్రిన్సిపాల్ కిష్టప్ప తెలిపారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్తీక వన భోజన కార్యక్రమానికి ఎంపీ, ఎమ్మెల్యేలు, కురువ సంఘ నాయకులు పాల్గొననున్నారని తెలిపారు. ఇందులో కురువల అభ్యున్నతి, ఎమ్మిగనూరులో కనకదాసు విగ్రహ ప్రతిష్ఠ తదితర అంశాలపై ప్రజాప్రతినిధులకు విన్నవించడం జరుగుతుందన్నారు. కెటి.వెంకటేష్, అయ్యలప్ప తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అవరోధం

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మెడికల్ కళాశాల, బైపాస్ రోడ్డు, షాపింగ్ క్లాంప్లెక్ నిర్మాణాలకు శ్రీకారం
- కూటమి ప్రభుత్వం వచ్చాక పనుల నిలిపివేత
- పనులు పూర్తి అయితే ప్రజలకు ఉపయోగం



నత్తనడకన కొనసాగుతున్న బైపాస్ నిర్మాణ పనులు



పిల్లర్ల దశలో నిలిచిపోయిన షాపింగ్ కాంప్లెక్స్

ఆదోని సెంట్రల్: పేద మధ్య తరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకుని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆదోనిలో మెడికల్ కళాశాల, పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను నియంత్రించడానికి బైపాస్ నిర్మాణ పనులను చేపట్టింది. గత ప్రభుత్వ హయాంలో శరవేగంగా సాగిన పనులకు కూటమి ప్రభుత్వం ఏర్పడిన బ్రేకులు పడ్డాయి. మెడికల్ కళాశాల నిర్మాణ పనులు ఆగి పోయాయి. బైపాస్ నిర్మాణ పనులు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. పట్టణంలో వ్యాపార సముదాయం కోసం నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు కూడా నిలచిపోయాయి. గత ప్రభుత్వంలో చేపట్టిన పనులను పూర్తి చేస్తే పేదలకు వైద్య విద్యతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

బైపాస్ పనులు

ఆదోని పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకు పెరుగుతోంది. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ఎన్‌హెచ్.167 కింద బైపాస్ నిర్మాణ పనులను చేపట్టేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆలూరు రహదారిలోని లక్ష్మమ్మవ్వ ఆర్చ్ నుంచి ఆస్పరి రహదారికి కలిసే విధంగా అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. అందుకు తగ్గట్లుగానే భూసేకరణ పనులను కూడా చేపట్టి రూ.94 కోట్లతో పనులను శర వేగంగా కొనసాగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు ఆగిపోయాయి. నాలుగు నెలలు తర్వాత తిరిగి పనులను ప్రారంభించారు. అయినా పనులు నత్తనడకన సాగుతున్నాయి. బైపాస్ పూర్తి అయితే ట్రాఫిక్ సమస్య తీరుతుందని పట్టణ ప్రజలకుతో పాటు వాహనదారులు ఎదురు చూస్తున్నారు. పాలకులు స్పందించి త్వరతగతిన పనులను చేపట్టి ట్రాఫిక్ సమస్యను నియంత్రించాలని కోరుతున్నారు.

మెడికల్ కళాశాల నిర్మాణం

వెనకబడిన ప్రాంతమైన ఆదోని డివిజన్‌లో మెడికల్ కళాశాల నిర్మాణం చేపడితే పేద మధ్య తరగతి ప్రజలకు వైద్యంతో పాటు విద్య కూడా అందుతుందని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మెడికల్ కళాశాలను మంజూరు చేసింది. ఆదోని-ఎమ్మిగనూర్ రహదారిలో దాదపు 58 ఎకరాల్లో రూ. 475 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణ పనులను శరివేగంగా చేపట్టింది. 430 పడకల ఆసుపత్రితో పాటు 100 మెడికల్ సీట్లతో కళాశాలను ప్రారంభించే దిశగా అడుగులు వేసింది. 2024–25 విద్యా సంవత్సరంలోనే వైద్య విద్యార్థులకు కళాశాలను ప్రారంభించి విద్యను అందించాలని సిబ్బందిని కూడా నియమించింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కళాశాల నిర్మాణ పనులు ఆగిపోయాయి. ప్రారంభం కావాల్సిన వైద్య విద్య కళాశాల కూడా వసతులు లేవనే సాకుతో అనుమతులు కూడా నిలిపి వేశారు. ప్రస్తుతం అత్యవసర వైద్య సేవలు కోసం బళ్లారి, కర్నూలు, రాయచూర్ వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఆదే మెడికల్ కళాశాల మనకు అందుబాటులో ఉంటే ఆదోని చుట్టుపక్కల ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందుతాయి.



నిలిచిపోయిన మెడికల్ కళాశాల నిర్మాణ పనులు

షాపింగ్ కాంప్లెక్స్

పురపాలక స్థలంలో వ్యాపార సముదాయాన్ని నిర్మించేందుకు పురపాలక అధికారులు చర్యలు చేపట్టారు. వ్యాపారుల వద్ద రూ.లక్షల్లో గుడ్‌విల్ తీసుకొని నిర్మాణ పనులను ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏమైయిందో ఏమో నిర్మాణ పనులు నిలచిపోయాయి. వ్యాపారం చేసుకోవడానికి షాపు వస్తుందని అప్పులు తెచ్చి మరీ చెల్లించామని, గత ఐదు నెలలుగా పనులు కొనసాగడం లేదంటూ ఇటీవల పురపాలక కమిషనర్‌కు వ్యాపారులు మొరపెట్టుకున్నారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు పూర్తయితే దుకాణాలు అన్నీ ఒక చోట ఉంటాయి కనుక కనుగోలుదారులకు ఉపయోగకరంగా ఉంటుంది.

కళాశాల పూర్తయితే అందరికీ మంచిది



ఆదోనిలో మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తయితే అందరికీ ఉపయోగకరంగా ఉంటుంది. పేద మధ్య తరగతి వారికి వైద్యంతో పాటు విద్యకూడా అందుతుంది. దూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకో లేక చాలమంది ఇబ్బంది పడుతున్నారు. పాలకులు అలోచించాలి. అభివృద్ధిలో ఇది ఒక భాగమే. ప్రజలకు ఉపయోగ పడే ప్రతి కార్యక్రమం అభివృద్ధే. ఇప్పటికైనా పాలకులు దృష్టి సారించి కళాశాల నిర్మాణ పనులను చేపట్టే విధం చర్యలు చేపట్టాలి.

– శ్రీనివాసులు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు

నిలిచి పోయిన పనులను ప్రారంభించాలి



నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులను తిరిగి ప్రారంభించాలి. ముఖ్యంగా పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. బైపాస్ నిర్మాణం పూర్తి అయితే కొంత వరకు సమస్య తీరుతుంది కనుక త్వరిత గతిన పనులను పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలి. మెడికల్ కళాశాలను ప్రైవేట్ పరం చేయకుండా ప్రభుత్వమే నిర్మాణ పనులను చేపట్టి.. వైద్యవిద్యతో పాటు పేద మధ్య తరగతి ప్రజలకు వైద్యం అందే విధంగా చర్యలను చేపట్టాలి. పట్టణంలో ఆగిపోయిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను కూడా పూర్తి చేస్తే వ్యాపారులకు, ప్రజలకు ఇబ్బందులు ఉండవు.

– దస్తగిరి నాయుడు, బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఉల్లికి గిట్టుబాటు ధర కల్పించాలి



ఉల్లి దిగుబడిని పరిశీలిస్తున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్

కోసిగి: ఉల్లికి గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కోసిగి మండలంలోని చింతకుంట గ్రామంలో ఉల్లి సాగు చేసుకున్న పొలాలను సీపీఐ ఆధ్వర్యంలో రైతులకు కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చింతకుంట గ్రామంలో బోరు బావుల కింద అత్యధిక మంది రైతులు ఉల్లి పంట సాగుచేసుకున్నారన్నారు. ఈ ఏడాది దిగుబడి పూర్తిగా తగ్గిపోయిందని, ఎకరాకు రూ.50వేల నుంచి రూ.70వేల వరకు ఖర్చు చేసుకుని సాగు చేసుకున్న పంటలకు దిగుబడి రాకపోవడంతో పాటు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. మార్కెట్‌లో క్వింటం ఉల్లి ధర రూ.2500 నుంచి రూ.3500 వరకు ధర పలికితే గిట్టుబాటు అవుతుందని చెప్పారు. రైతులు నరసమ్మ, రాజేశ్వరి, నీలమ్మ, రాకేష్, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలి



ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

ఆదోని రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాల అమలు చేస్తామని ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని సీపీఎం నాయకులు లింగన్న డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పెద్దహరివాణం, సంతెకూడ్లూరు, బలదూర్ గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై ప్రజాపోరు కార్యక్రమం నిర్వహించారు. ప్రజాపోరు పోస్టర్స్‌ను ప్రజలకు అందించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. అన్నిటికంటే ముఖ్యమైన పిల్లల చదువుకు సంబంధించి తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు, 18 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు రూ.1500, రైతు భరోసా కింద రూ.20 వేలు తదితర పథకాలు నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు తిక్కప్ప, లక్ష్మన్న, శాఖ కార్యదర్శులు ఎం.అయ్యన్న, జి.పరమేష్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి గోవిందు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని బైపాస్ రోడ్డు, మహబుబ్ నగర్ కాలనీల్లో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా పోరు బాట కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, ప్రభుత్వ తీరును ఎండగడుతూ ప్రచారం చేపట్టారు.

ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలేవీ ?

ఆదోని అర్బన్: పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో అవినీతి గురించి గొంతెత్తుతున్నా ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి వాటిపై చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి (ఎంహెచ్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి ఎ.నూర్‌అహ్మద్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వ సొమ్మును అడ్డంగా బొక్కేశాయని స్వయంగా ఎమ్మెల్యే పార్థసారథినే ఆరోపించారన్నారు. అలాంటప్పుడు ఆ ఆస్పత్రులపై కేసు నమోదు చేసి, డబ్బు రికవరీ చేసి తన నిజాయితీని నిరూపించుకోవాలన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన ఐదు నెలల నుంచి అవినీతిపరులను విమర్శించడం, హెచ్చరించడం తప్పా ఒక్క కేసు నమోదు చేయని విమర్శించారు. తన మిత్రుడు డాక్టర్ రవికిరణ్‌పై వచ్చిన భూ కబ్జా అభియోగాలపై ఎలాంటి పెద్ద కేసులు పడకపోవడంలో ఎమ్మెల్యే పాత్రపై అనుమానంగా ఉందని ఆరోపించారు.

ఉచిత ఇసుక హామీకే పరిమితం



ఉరితాళ్లు వేసుకొని నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

ఎమ్మిగనూరుటౌన్: అధికారంలోకి వస్తే ఇసుక ఉచితంగా ఇస్తామన్న కూటమి హామీ ప్రకటనకే పరిమితమైందని భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ అన్నారు. ఉచిత ఇసుక హామీ అమలు కాకపోతుండటంతో ఆదివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణలోని సోమప్ప సర్కిల్‌లో భవన నిర్మాణ కార్మికులు ఆందోళన చేపట్టారు. మెడకు ఉరితాళ్లు బిగించుకొని నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఉచిత ఇసుక లేక పోవడంతో భవన నిర్మాణాలు జరగడం లేదన్నారు. స్వయానా సీఎం చంద్రబాబు నాయుడు ఇసుకను సొంత వాహనాల్లో తీసుకొని వెళ్ల వచ్చని చెప్పారని, అందుకు విరుద్ధంగా నియోజకవర్గంలో ఇసుక వ్యాపారం కొనసాగుతుందని ఆరోపించారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ట్రాక్టర్ ఇసుక రూ.4వేలుండగా కూటమి ప్రభుత్వంలో రూ.4,500లకు విక్రయిస్తున్నారన్నారు. ఈవిషయంపై ఎమ్మెల్యే జయనాగేశ్వర్‌రెడ్డి దృష్టి పెట్టి ఉచిత ఇసుక అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సమివుల్లా, భవన నిర్మాణ కార్మికులు నాగరాజు, సుంకన్న, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి



వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

నందవరం : వాహనదారులు రోడ్డు నింబంధనలు పాటించాలని ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. ఆదివారం మండల పరిధిలోని ముగతి సర్కిల్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ..ద్విచక్ర వాహనదారులు తప్పని సరి హెల్మెట్ ధరించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, రోడ్డు పర్మిట్ వంటి ధ్రువపత్రాలను వాహనాలలో ఉంచుకోవాలని సూచించారు. ఓవర్ లోడ్డుతో వాహనాలను నడపవద్దని, వాహనాలలో అక్రమంగా మద్యం, మత్తు పదార్థాలు వంటి అసాంఘిక చర్యలు చేపడితే వాహనాలను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆడిటోరియం ఏర్పాటు చేయాలి

ఆదోనిటౌన్: ఆదోని పట్టణంలో ఆడిటోరియాన్ని ఏర్పాటు చేయాలని వెఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా సంస్కృతిక విభాగం అధ్యక్షులు ఎస్.గోపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఆదోని పట్టణంలో గతంలో మున్సిపల్ రిక్రియేషన్ క్లబ్‌లో నాటక ప్రదర్శనలు ఇవ్వడానికి, సమావేశాలు నిర్వహించడానికి అనుకూలంగా ఉండేదన్నారు. కానీ ప్రస్తుతం రీ క్రియేషన్ క్లబ్‌ను నాటక ప్రదర్శనలకు అనుకూలంగా లేకుండా చేశారన్నారు. ప్రభుత్వం స్పందించి ఆదోని పట్టణంలో నాటక ప్రదర్శనలు నిర్వహించడానికి, కళా రంగాన్ని ప్రోత్సహించడానికి ఆడిటోరియం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ముమ్మరంగా ఓటరు నమోదు



ఓటరు నమోదును పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ రుద్రగౌడ

కోసిగి: మండలంలో ఓటరు నమోదు, అభ్యంతరాల ప్రక్రియ ముమ్మరంగా చేపట్టారు. శని, ఆదివారాల్లో పోలింగ్ బూత్‌లలో బూత్ లెవెల్ ఆఫీసర్స్ ఓటరు నమోదు ప్రక్రియ చేపట్టారు. ఓటరు నమోదును డిప్యూటీ తహసీల్దార్ రుద్రగౌడ, ఆర్‌ఐ శ్రీరాములు పరిశీలించారు. రెండు రోజులలో మండలంలోని 62 పోలింగ్ బూత్‌లలో మొత్తం 81 దరఖాస్తులు వచ్చినట్లు వారు తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ పరుశురాముడు, వీఆర్వోలు, బూత్ లెవెల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఓటరు నమోదులో నిర్లక్ష్యం వద్దు



రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ సల్కాపురం రవి

మంత్రాలయం: ఓటరు నమోదు ప్రక్రియలో బూతులెవల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని మంత్రాలయం తహసీల్దార్ సల్కాపురం రవి హెచ్చరించారు. ఆదివారం ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా కల్లుదేవకుంట పోలింగ్ బూత్‌లో చేపట్టిన నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు 157 ఓటరు దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు.

జీవితం సంతోషంగా గడపాలి



మంత్రాలయం చేరుకున్న ముత్తుకుమార్ సైకిల్‌యాత్ర

మంత్రాలయం: ప్రతి ఒక్కరూ ఉన్న దాంట్లో తృప్తిపడుతూ సంతోషంగా జీవించాలని సైకిల్ యాత్రికుడు ముత్తుకుమార్ పిలుపునిచ్చారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు పట్టణంలోని సుబ్బన్నపాలెంకు చెందిన ముత్తుకుమార్ గత నెల 18న స్వగ్రామం నుంచి సైకిల్ పై 4వ సారి కాశీ యాత్రకు బయలుదేరారు. ప్రయాణంలో భాగంగా తిరుమల, తిరుపతి, శ్రీకాళహస్తి, నెల్లూరు, చెన్నై,ఒంగోలు, నల్గొండ, హైదరాబాద్ మీదుగా ఆదివారం రాత్రి మంత్రాలయం చేరుకుని గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనంకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకుని బస చేశారు. సోమవారం ఇక్కడి నుంచి బయలుదేరి హంపి, మురుడేశ్వర్, గోకర్ణ, గోవా, బాంబే, గుజరాత్, రాజస్థాన్, ఢిల్లీ, ఆగ్రా, అయోధ్య మీదుగా కాశీ క్షేత్రానికి చేరుకుంటానని ముత్తుకుమార్ తెలిపారు. తన యాత్ర దాదాపు 6 వేల కి.మీ పైగా సాగుతుందని చెప్పారు.

శ్రీ మఠంలో కర్ణాటక మంత్రి



శ్రీ మఠంలో మంత్రి కుటుంబ సభ్యులు

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు కర్ణాటక రాష్ట్రం చిన్న పరిశ్రమలశాఖ మంత్రి శరణబసప్ప కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం రాత్రి మంత్రాలయం వచ్చారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీరాఘవేంద్రస్వామి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వీరిని శ్రీ మఠం అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు. అసిస్టెంట్ పీఆర్వో వ్యాసరాజాచార్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

కాలువ ఇలా.. నీరు పారేదెలా?



కోసిగి సమీపంలో ఎల్లెల్సీ కాల్వలో ఏపుగా పెరిగిన ముళ్ల పొదలు

కోసిగి: మండలంలో ప్రవహిస్తున్న ఎల్లెల్సీ కాల్వలో సాగు నీటికి ప్రవాహానికి ముళ్ల కంప చెట్లు అడ్డుగా మారాయి. మాధవరం హెడ్ క్వార్టర్స్ నుంచి కోసిగి మండలంలోని ఎల్లెల్సీ కాల్వలో నీరు ప్రవహిస్తోంది. మండలంలో వందగల్లు, కొల్మాన్‌పేట, దుద్ది, కోసిగి, దేవరబెట్ట, ఐరన్‌గల్లు, డి.బెళగల్ గ్రామాల మీదుగా మంత్రాలయం మండలంలోని రచ్చుమర్రి, మాధవరం వరకు నీరు ప్రవహిస్తుంది. అయితే కోసిగి సమీపంలో కాలువలో ముళ్ల కంపలు, చెత్తాచెదారం పేరుకుపోయాయి. దీంతో దిగువ ప్రాంతాల రైతులు సాగునీరు పూర్తి స్థాయిలో రాక ఆందోళనకు గురవుతున్నారు. రబీ సీజన్‌లో ఆయా ప్రాంతాలలో ఎక్కువగా భాగం రైతులు ఉల్లి, మిరప, వేరుశనగ, పత్తి, కంది పంటలను సాగు చేసుకున్నారు. ఇరిగేషన్ అధికారులకు పలుమార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ఎల్లెల్సీ కాల్వలలో పేరుకుపోయిన ముళ్ల పొదలు, అడ్డుగా ఉన్న చెత్తాచెదారం తొలగించి చివరి ఆయకట్టు రైతులకు పుష్కలంగా సాగునీటిని అందించాలని కోరుతున్నారు.



దేవరగట్టులో కార్తీకమాస పూజలు



పూజలందుకుంటున్న మాళ మల్లేశ్వరస్వామి

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం కార్తీక మాసం రెండవ వారంలో భాగంగా మాళ మల్లేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకలు, బండారార్చన, పుష్పార్చన, మహామంగళ హారతి, ఆకుపూజ, నివేదన, నిరాజనం తదితర పూజలు జరిపించి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా స్వామి మూలవిరాట్‌లను విశేషంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.